సాక్షి సిద్దిపేట

బుధవారం ၊ 19 ၊ ఏప్రిల్ ၊ 2023

పెద్ద చేప



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరు గ్రామంలోని ఎల్లమ్మ చెరువుల్లో మత్స్యకారుల వలకు 15 కిలోల చేప వలకు చిక్కింది. ఇది చూసినవారంతా అమ్మో ఇందపెద్ద చేపనా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.




మెడకు చీర బిగించి..

మెడకు చీర బిగించి నీటిలో తేలిన రెండు నెలల బాలుడి శవాన్ని మంగళవారం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలో పోలీసులు గుర్తించారు. 8లో



గోదాంలో అగ్ని ప్రమాదం

తుక్కు గోదాంలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలో జరిగింది. 8లో..



పశువుల బీమా ఇస్తలేరు!

'హుస్నాబాద్‌కు చెందిన లక్ష్మణ్ కొడుకు తిరుపతి(18) ఆరునెలల క్రితం గేదెలు మేపడానికి వెళ్లాడు. గేదె కరెంట్ షాక్ కు గురై అక్కడిక్కడే చనిపోయింది. దానిని కాపాడబోయిన ఆయనా మృత్యువాత పడ్డాడు. ఓ వైపు కొడుకు మృతి, మరో వైపు జీవనాధారమైన గేదె చనిపోవడంతో లక్ష్మణ్‌కుంగిపోయాడు. ప్రభుత్వం పశువుల బీమా అందజేస్తే ఆయనకు కనీసం ఆర్థిక భరోసా ఉండేది'



గాంధీనగర్‌లో గత ఏడాది జూలైలో విద్యుత్ షాక్‌తో చనిపోయిన ఎద్దు

- ఏళ్లుగా బాధితుల ఎదురుచూపులు
- ఆదుకోవాలని వేడుకోలు

హుస్నాబాద్‌రూరల్: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమలు కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలపై చిన్నచూపు చూస్తోంది. పశుబీమా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నదాతలు ఏడేళ్ల క్రితం ఒక్కో పశువు కోసం రైతులు ప్రీమియం రూ.300 నుంచి రూ. 500 వరకు ప్రభుత్వానికి చెల్లించేవారు. పశువులు మరణిస్తే నష్టాన్నిబట్టి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు పరిహారం అందేది. వాటితో మళ్లీ పశువులు కొనేవారు. ఆర్థికంగా ఇబ్బంది లేకుండా ఉండేది. ఏడేళ్లుగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేయడంలేదు. దీంతో పశువులు మృతిచెందినప్పుడు రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఏటా మృతి..

ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, వ్యాధులతో ఏటా వేల సంఖ్యలో పశువులు మృతిచెందుతున్నాయి. పశువులు చనిపోవడంతో రైతులకు రూ.వేల్లో నష్టం జరుగుతుంది. అప్పుచేసి కొన్న పశువులు అర్ధంతరంగా మృత్యువాతపడితే ఆ రైతుల పరిస్థితి దుర్భరంగా మారుతోంది. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో ఏడాది వ్యవధిలో 10 మంది రైతుల పశువులు మృతిచెందాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి ఇబ్బందిపడుతున్నారు.

విద్యుత్ ప్రమాదాలతోనే ఎక్కువ..

విద్యుత్ ప్రమాదాల కారణంగా పశువులు ఎక్కువగా మృతిచెందుతున్నాయి. ఏటా వేసవిలో ఆఫీసర్లు లూజ్ లైన్స్ సరిచేయాల్సి ఉంటుంది. అయితే విద్యుత్ స్తంభాల కొరత కారణంగా లూజ్ లైన్స్ పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు నివారణ కష్టంగా మారింది. విద్యుత్, వివిధ ప్రమాదాల్లో మరణించిన పశువులకు వెటర్నరీ డాక్టర్లు పంచనామా చేసి నష్టం అంచనా రూపొందించాలి. ఆమేరకు విద్యుత్‌శాఖ నుంచి పరిహారం కావాల్సి ఉంటుంది. ఇదంతా మూడు నెలల వ్యవధిలోనే పూర్తి కావాల్సి ఉండగా ఏళ్లుగా నిలిచిపోవడంతో బాధితులకు నష్టం జరుగుతోంది. వ్యవసాయ పనుల కోసం అప్పులు చేసి ఎడ్లను కొంటే అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్‌కు గురై మూగజీవాలు మృతిచెందినా పరిహారం రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం రాలేదు

భూమి కౌలుకు తీసుకొని ఎవుసం చేస్తున్న క్రమంలో కరెంట్‌షాక్‌తో ఎద్దు చనిపోయింది. లక్ష రూపాయల నష్టం జరిగింది. ఎవుసం నడవకుండా అయ్యింది. ఓ ఆసామి దగ్గర అప్పు తెచ్చి ఎద్దును కొంటే వానాకాలం, యాసంగి వ్యవసాయం చేసిన. ఇప్పటివరకు పరిహారం రాలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు భూమి, తక్కువ హైట్‌లో ట్రాన్స్ ఫార్మర్లు పెట్టడంతో గడ్డిమేసేందుకు వెళ్లిన పశువులు విద్యుదాఘాతంతో చనిపోతున్నాయి.

– పోలు రవి, గాంధీనగర్

త్వరలో ఇస్తాం



హుస్నాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఐదు పశువులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. పంచనామా నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. మంజూరు అయిన వెంటనే బాధిత రైతులకు అందజేస్తాం. లూజ్ లైన్ల సమస్య పరిష్కారం, విద్యుత్ స్తంభాల కోసం ప్రతిపాదించాం. వేసవి కాలంలో ఎక్కడ లూజ్ లైన్లు ఉన్నా రిపేర్ చేయిస్తాం.

– దుర్గా శ్రీనివాస్, ఏడీ హుస్నాబాద్

న్యూస్‌రీల్

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం



కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోదూరు(సిద్దిపేట): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం చిన్నకోదూరు మండల పరిషత్ కార్యాలయంలో 400 మంది ముస్లింలకు రంజాన్ తోఫాలు అందజేశారు. రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, రైతు బంధు జిల్లా సభ్యులు వెంకటేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ ఉమేశ్ చంద్ర, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం మంగళవారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని ఇతర రాష్ట్రాలు అనుకరిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కుట్రలను కార్యకర్తలు ఎదుర్కోవాలని కోరారు. సీఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ పటిష్టతకు పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత గౌరవం దక్కుతుందని తెలిపారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ఆత్మీయ సమ్మేళనాలు సక్సెస్ చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం అన్నారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ అనంతరెడ్డికి అందించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వలస కార్మికుల సంక్షేమంపై ఆలోచన చేస్తూ స్థానిక కార్మికుల పట్ల వివక్షను చూపుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రతీ పల్లెలో గులాబీ జెండా ఎగరాలి

- ఆత్మీయవేడుకలు నిర్వహిద్దాం
- 25న నియోజకవర్గ కేంద్రాల్లో ప్లీనరీలు
- టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటజోన్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో 22 ఏండ్ల పార్టీ ఆవిర్భావం, తొమ్మిదేళ్ల ప్రగతి ప్రస్థానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, సీఎం ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్లీనరీలు ఆత్మీయ వేడుకల తరహాలో అట్టహాసంగా నిర్వహించాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖమంత్రి టి.హరీశ్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 25న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో ప్లీనరీ సమావేశాలు నిర్వహించాలని కోరారు. ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు మద్దతు లభిస్తుందన్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు దేశానికి అవసరమని యావత్తు ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాంతీయ పార్టీగా స్టార్ట్ అయి జాతీయ పార్టీగా ఎదిగిందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పదవులు ఉన్నవారు, ప్రజాప్రతినిధులు ప్లీనరీల్లో భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాల్లో పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అదేరోజు ఉదయం అన్ని గ్రామాలు, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. సమావేశాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పార్టీ ఆవిర్భావం, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు.

సంక్షేమమే సర్కార్ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం కోనాపూర్‌లో ఆయన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పరిశీలించారు. పనులు త్వరంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం నర్సంపేట గ్రామంలో లైబ్రరీ రీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ముబారస్ పూర్‌లో కుర్మ, ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఒకపక్కుడు ఉమ్మడి జిల్లాలో కరువు పీడిత ప్రాంతాల్లో మొదటి స్థానంలో ఉన్న దౌల్తాబాద్ మండలం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్ , జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి, లీడర్లు శ్రీనివాస్ గుప్త, జీవన్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ధర్నా

గజ్వేల్ రూరల్: డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పేదలు ధర్నా నిర్వహించారు. డబుల్ బెడ్‌రూమ్ సాధన కమిటీ కన్వీనర్ సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి శశిధర్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏళ్ల తరబడి నిరుపేదలు కిరాయి ఇళ్లలో ఉంటునఆరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లు సరిపోవని, సుమారు 2500 మంది అర్హులైన పేదలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం మరోసారి సర్వేచేపట్టి అర్హులకు 120 గజాలస్థలం, డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణానికి సహకరించాలన్నారు. లేదంటే అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో ఐద్వా జిల్లా కార్యదర్శి శారద, సీఐటీయూ మండల కార్యదర్శి సందీప్, రంగారెడ్డి, బాసయ్య, బాబురావు, పద్మ, కవిత, అనిత, రాణి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, సులోచన, నరహరి, కిష్టయ్య, శోభ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

సిద్దిపేటను దిక్సూచిగా నిలపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: 'మన ఊరు మన బడి' పథకం పనులు త్వరగా పూర్తిచేసి రాష్ట్రానికి దిక్సూచిలా నిలపాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆఫీసర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సిద్దిపేట నియోజకవర్గంలో జరుగుతున్న పనులపై మండలాలవారీగా ఎంఈవో, ఎంపీడీవో , ఏపీవో, ఏఈ, డీఈలు, సర్పంచులు, నిర్మాణ ఏజెన్సీలతో రివ్యూ నిర్వహించారు. పనుల్లో క్వాలిటీ పాటించాలన్నారు. మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ త్వరగా పూర్తి చేసి పెయింటింగ్ వేయించాలన్నారు. ప్రహరీ, అడిషనల్ రూమ్‌లు, డైనింగ్ హాల్ ఇతరత్రా పనులు కంప్లీట్ చేయించాలన్నారు. తడకపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనులు వేగంగా పూర్తి చేయించాలని, సుందరీకరణ బాధ్యతలను అర్బన్ ఎంపీడీవో సమ్మిరెడ్డి తీసుకోవాలన్నారు. మిట్టపల్లి హైస్కూల్ సుందరీకరణ బాధ్యత ఎంఈఓ, నారాయణరావుపేట హైస్కూల్ పనులు ఎంపీఓకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. నంగునూరులో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడిషనల్ టీఎంసీ కోసం భూసేకరణ చేయాలి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో చేపట్టనున్న అడిషనల్ టీఎంసీ కోసం భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ ఆఫీసర్లతో రివ్యూ నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు కళ్లముందు చుస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసేందుకు మిడ్ మానేరు నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్ వరకు అదనపు టీఎంసీ పనుల కోసం భూసేకరణ కంప్లీట్‌చేయాలన్నారు. అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులను తక్కువ టైంలో నింపి సాగు, తాగు నీటిని అందజేయడం కోసం అడిషనల్ టీఎంసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భూసేకరణలో ఎవరికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బస్వరాజ్, ఈఈ సాయిబాబా, ఏఈ ఖాజపాషా, డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

బార్డర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి

డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: తెలంగాణ సరిహద్దు రాష్ట్రాల బార్డర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని డీజీపీ అంజనీకుమార్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మద్యం రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బార్డర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆయాశాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడుతున్న ప్రతీ ఒక్కరికి సీఈఐఆర్ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో సీపీ శ్వేత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌మూర్తి, సివిల్ సప్లై అధికారి హరీశ్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన సీపీ శ్వేత, పోలీసు అధికారులు

మోదీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

ప్రజా చైతన్యయాత్రలో చాడ వెంకట్‌రెడ్డి



చేర్యాలలో ర్యాలీగా వెళ్తున్న చాడవెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకులు

కొమురవెల్లి/చేర్యాల/గజ్వేల్ రూరల్(సిద్దిపేట): ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అమ్ముతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి కోరారు. ‹బీజేపీ హటావో.. దేశ్‌కు బజావో› నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర మంగళవారం కొమురల్లి, చేర్యాల, గజ్వేల్‌లో కొనసాగింది. దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడంలేదన్నారు. ప్రధానమంత్రి మోడీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. దేశసంపన్నుడు అదానీ 3 లక్షల వేల కోట్లు బ్యాంకులకు బాకీ ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, విద్యుత్ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని, డీజీల్, పెట్రో, నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పెన్షన్, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల హామీ నెరవేర్చలేదన్నారు. సీపీఐపై మతతత్వ బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను పడగొట్టడానికి ఈడీ, ఐటీ, సీబీఐతో దాడులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరచరిత్ర కలిగి ఉన్నారన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గగనుల ప్రైవేటీకరణను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, రుణమాఫీ అమలు చేయాలని, పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాండ్ర సదానందం, గడిపే మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య, లీడర్లు మంత్రి వెంకటస్వామి, సదానందం, కృష్ణ, చిక్కుడు రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చింత శ్రీనివాస్, జనార్ధన్, మధు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడీ అవుతున్న రిసార్ట్

చిన్నకోదూరు మండలంలోని చంద్లాపూర్ శివారు రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద రిసార్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1.50 కోట్లతో నాలుగెకరాల స్థలంలో మూడు కాటేజీలు నిర్మించారు. రెస్టారెంట్, బాంకెట్ హాల్ కట్టారు. చిన్నారులకోసం ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. త్వరలో రిసార్ట్ అందుబాటులోకి రానుంది.

– చిన్నకోదూరు(సిద్దిపేట)



సిద్ధమైన కాటేజీలు



రెస్టారెంట్



చిన్న పిల్లల ఆట వస్తువులు

క్లుప్తంగా

24 వరకు పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: పాలిసెట్ 2023 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని శివ్వంపేట మండలం గోమారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని మంగళవారం తెలిపారు. ఈ పాలిసెట్ పరీక్షకు పదో తరగతి రాసిన వారు, ఇదివరకే పాసైనవారు అర్హులని తెలిపారు. డిప్లొమా కోర్సు చేయడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. అదేవిధంగా ఎన్నో రంగాలలో ఉద్యోగావకాశాలు పొందవచ్చని లేదా స్వయం ఉపాధి పథకాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. మే 17తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు పాలిసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

ఇంటర్నెట్ సెంటర్‌పై ఎస్ఓటీ పోలీసుల దాడులు

పటాన్‌చెరు టౌన్: ఇంటర్నెట్ సెంటర్‌పై ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకున్ని అదుపులోకి తీసుకున్న సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మార్కెట్లో ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నిర్వాహకుడు జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.లక్ష, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాల్లో మూడు, నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి వారికి రూ.14,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కుక్కలు, కోతుల బెడద తీర్చాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో కుక్కలు, కోతుల, దోమల బెడద ఉందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డికి వారు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రవీందర్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

కాలనీలో నీటి సమస్యను పరిష్కరించండి

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రంలోని మార్క్స్ నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్ ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏఓ మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్స్ నగర్‌లో రెండు బోర్లు చెడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు పన్యాల వజీర్ బేగ్, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు అనురాధ, పట్టణ సమితి సభ్యులు హమీద్, కరుణాకర్, కృష్ణ, పావని, రజియా, నిర్మల, పోచమ్మ, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కూరగాయల వ్యాపారి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): గుండెపోటుతో కూరగాయల వ్యాపారి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. చండి గ్రామానికి చెందిన ఉప్పరి మహేందర్(49) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తూప్రాన్ సంతలో కూరగాయలు అమ్మేందుకు వెళ్ళగా అక్కడ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు.

రోగుల రద్దీ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోజురోజుకు రోగుల తాకిడికి అనుగుణంగా సౌకర్యాలు మరింత మెరుగు పర్చాలి. గర్భిణిలు ఓపీ స్లిప్‌ల కోసం గంటలు తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి నెలకొంటుంది. స్లిప్ తీసుకొని డాక్టర్ దగ్గరకు వెల్దామంటే అక్కడా క్యూలో నిలబడాల్సి వస్తోంది. గర్భిణిలు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేయాలని రోగులు వారి బంధువులు కోరుతున్నారు.

–సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



ఓపీ స్లిప్ల్ కోసం గంటలు తరబడి క్యూలైన్‌లో అవస్థలు పడుతున్న గర్భిణిలు



కౌంటర్ మూసి వేయడంతో మందులకోసం నిలబడలేక నేలపై కూర్చున్న రోగి



ఆస్పత్రిలో కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో నేలపై సేదతీరుతున్న రోగులు, వారి బంధువులు



అపరిశుభ్రంగా మరుగుదొడ్డి

రైతుల అసైన్డ్ భూములను లాక్కునే యత్నం

- భూములు పోతాయని భయపెడుతున్న ప్రజాప్రతినిధులు
- చెక్కులు ఇచ్చి లాక్కుంటున్న ప్రైవేటు వ్యక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని వావిలాల, గడ్డపోతారం గ్రామల పరిధిలో రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను కొంత మంది ప్రైవేటు వ్యక్తులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయిస్తుందని రైతులను ప్రతీనిత్యం కొంతమంది ప్రైవేటు వ్యక్తులు భయపెడుతున్నారు. రైతులు వారి భూములను అమ్ముకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఎకరా రూ.4కోట్లు పలికే భూములను ప్రైవేటు వ్యక్తులు సుమారు రూ.30లక్షలు ఇచ్చి భూములను కాజేస్తున్నారు. రైతులనుంచి స్వచ్ఛందంగా భూములను తీసుకోవచ్చని రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు సూచిస్తున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములను ప్రైవేటు వ్యక్తులు ఎందుకు విక్రయిస్తున్నారనే విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకమై తక్కువ ధరకే భూములను సొంతం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఓ ముఖ్య నేత ఇందుకు ప్రాతినిథ్యం వహిస్తున్నరని స్థానికులు చెబుతున్నారు. రైతులను భయపెట్టి భూములను లాక్కునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో భారీ భూ కుంభకోణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తెరలేపుతున్నారని స్థానికులు, కొందరు రైతులు చెబుతున్నారు.

ఈ విషయంలో ప్రైవేటు వ్యక్తుల కల్లబొల్లి మాటలకు రైతులు మోసపోవద్దని, న్యాయపరంగా ఎదుర్కొనేందుకు తమవంతు సహకారం ఇస్తామని స్థానిక యువజన నాయకులు శ్రీకాంత్ తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ దశరథ్‌ను వివరణ కోరగా రైతులు స్వచ్ఛందంగా వచ్చి భూములను తమకు ఇస్తున్నారని, తాము లీగల్‌గానే ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

మెడకు చీర బిగించి.. ఆపై నీటిలో పడేసి..

కాలువలో తేలిన చిన్నారి మృతదేహం

కౌల్చారం(నర్సాపూర్): మెడకు చీర బిగించి..ఆపై నీటిలో పడేసి.. కాలువలో తేలిన రెండు నెలల చిన్నారి శవాన్ని పోలీసులకు లభ్యమైన ఘటన కౌల్చారం మండలం పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని మహబూబ్ నహర్(ఎంఎన్)కాలువలో మంగళవారం ఉదయం వెలుగు చూసింది. మెదక్ రూరల్ సీఐ విజయ్, స్థానికుల కథనం ప్రకారం..పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని ఎంఎన్ కాలువలో సుమారు రెండు నెలల మగ శిశువు మృతదేహం స్థానికులకు కనిపించింది. ఈ విషయాన్ని వారు పోలీసులకు చేరవేశారు. అక్కడికి చేరుకున్న రూరల్ సీఐ, కౌల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ స్థానికులతో కలిసి కాలువలో నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకి తీయించారు. మృతదేహంపై ఎలాంటి బట్టలు లేకపోవడం, మెడను రవికతో బిగించి ఆపై బండరాయి కట్టి బాలుడిని ఊపిరాడకుండా ఉండేవిధంగా నీటిలో పడేశారన్నారు.

మృతదేహం నీటిలో తేలకుండా బండరాయి కట్టి వనదుర్గ ప్రాజెక్టులో పడేసి ఉండొచ్చని, కాలువ ప్రవాహానికి ఆ బాలుడి శవం కొట్టుకొని రావచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ముక్కుపచ్చలారని చిన్నారి మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరు కంటతడి పెట్టారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కాలువలో తేలిన బాలుడి మృతదేహం

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు



ఆటో ముందు భాగంలోని సీట్లను తొలగిస్తున్న ఎస్ఐ

పటాన్‌చెరు టౌన్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకెళ్తే చర్యలు తప్పవని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఆటోలో డ్రైవర్ పక్కన ఇరువైపులా కూర్చునేందుకు అమర్చిన సీట్లను తొలగించేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు ఏదో ఒక చోట వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఆటోడ్రైవర్లు ముఖ్యంగా సెల్‌ఫోన్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగం పేరిట ఆన్‌లైన్ మోసం

సిద్దిపేటకమాన్: ఉద్యోగం పేరిట గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింకును ఓపెన్ చేసి ఓ బాధితుడు డబ్బులు పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మంచి ఉద్యోగం ఉందంటూ ఆఫర్ చేశాడు. మాయమాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి పంపిన టెలిగ్రామ్ గ్రూప్‌లో లింకును ఓపెన్ చేసి తన ఫోన్‌లో ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. దీంతో తన ఖాతా నుంచి రూ.1,31,900 డెబిట్ అయినట్లు గుర్తించాడు. బాధితుడు సైబర్ నేరం జరిగినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఆర్మీ జవాన్ పేరుతో..

మరో ఘటనలో పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. తను జవాన్ అంటూ పరిచయం చేసుకున్నాడు. క్యాంటీన్‌లో తక్కువ ధరకు ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులో ఉంటాయని నమ్మబలికాడు. ఈ విషయాలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.45వేలు పంపి మోసపోయాడు.

తక్కువ సమయంలో లాభం వస్తుందని..

సిద్దిపేట పట్టణానికి చెందిన మరో వ్యక్తికి సైబర్ నేరగాడు ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో లాభాలు వస్తాయని తెలిపాడు. ఈ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్లో పలు దఫాలుగా రూ.1,03,000 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరగాడి అకౌంట్లో రూ.93వేలు జమ

మిరుదొడ్డి(దుబ్బాక): ఓ బాధితుడి బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాడి అకౌంట్లోకి రూ. 93వేలు జమ అయిన ఘటన మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తికి ప్రైవేట్ జాబ్ ఇప్పిస్తామని ఫోన్ ద్వారా అపరిచితులు నమ్మబలికినట్లు తెలిసింది. తాము చెప్పిన అడ్రస్‌కు మనీ ట్రాన్స్‌ఫర్ చేయాలని సైబర్ నేరగాళ్లు కోరినట్లు సమాచారం. దీంతో బాధితుడు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా రాజ్ ఎక్స్‌ఫర్ట్ విజన్ టెక్నో గోరఖ్‌పూర్ వారికి రూ.93వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొద్ది సేపు తర్వాత తను పంపిన డబ్బులు ట్రాన్స్‌ఫర్ కాక ఎవరో సైబర్ నేరగాడి అకౌంట్లోకి వెళ్లినట్లు గమనించాడు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్1930కు ఫిర్యాదు చేశాడు.

మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు (ఇన్ సెట్లో) గాయాల పాలైన గిరి

కౌల్చారం(నర్సాపూర్): మద్యం మత్తులో కారునడపడం వల్ల బోల్తా కొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కౌల్చారం మండల కేంద్రంలోని మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. కౌల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మాచవరం గ్రామానికి చెందిన గిరి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. మాచవరం నుంచి హైదరాబాద్ కారులో వెళ్తున్న క్రమంలో కౌల్చారం గ్రామ శివారులోని సత్యసాయి రైస్ మిల్ మూలమలుపు వద్ద బోల్తా కొట్టినట్లు తెలిపారు. దీంతో కారుడ్రైవర్‌కి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్యం సేవించి కారు నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని, ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. జీవితంపై విరక్తి చెందిన యువకుడు కుకునూర్‌పల్లిలో ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఢీసీఎం ఢీకొన్నఘటనలో గాంధీలో చికిత్సపొందుతూ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.

జగదేవ్‌పూర్‌లో యువకుడు...

జగదేవ్‌పూర్(గజ్వేల్): జీవితంపై విరక్తితో ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం... కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన మధు(30) గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటున్నాడు. కాగా కుటుంబ కలహాల వల్ల తన భార్య రెండేళ్ల నుంచి రావడం లేదు. ఈ క్రమంలో ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు జరుగుతుండడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గాంధీకి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మధు (ఫైల్)

జేసీబీ ఢీ కొని..

నిజాంపేట(మెదక్): జేసీబీ ఢీ కొని భర్త మృతి చెందగా చికిత్స పొందుతూ భార్య మృతి చెందిన సంఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో గత 5 రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని జేసీబీ ఢీ కొని గోట్టిపర్తి బాలగౌడ్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య గోట్టిపర్తి శోభ(32) తలకు తీవ్రగాయలు కావడంతో ఆమెను మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గోట్టిపర్తి శోభ (ఫైల్)

చెరువులో పడి గీత కార్మికుడు..

వెల్దుర్తి(తూప్రాన్): ప్రమాదవశాత్తు చెరువులో పడి గీతా కార్మికుడు మృతి చెందిన సంఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. మంగళవారం కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరిల గ్రామానికి చెందిన పొన్నం పోతాగౌడ్ (48)గీతా వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగా సోమవారం కల్లు గీయడానికి ఇంటి నుంచి వెళ్లి, రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుం సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం చూసేసరికి వెల్దుర్తి గ్రామ శివారులోని కుడి చెరువులో శవమై కనిపించాడు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు. సోమవారం కల్లు గీసి ఇంటికి వచ్చే క్రమంలో కాళ్లు, చేతులు కడుకునేందుకు చెరువుకు వెళ్లి అందులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

కొండపాకలో వృద్ధురాలు...

కొండపాక(గజ్వేల్): మతి స్థిమితం లేని వృద్ధురాలు నీల నర్సవ్వ (70) చెరువులో పడి మృతి చెందినట్లు త్రీ టౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని బందారం గ్రామానికి చెందిన నీల నర్సవ్వ గత కొన్ని నెలలుగా మతి స్థిమితం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె సమీపంలోని చెరువులో పడి మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారన్నారు. మృతురాలి కూతురు భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాను ప్రకాశ్ తెలిపారు.

మంజీరానదిలో..



మంజీరాలో తేలిన మృతదేహం

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల పరిధిలోని రాయిపల్లి వంతెన వద్ద మంజీరా నదిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. స్థానికులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..నదిలో మహిళ మృతదేహాన్ని గుర్తించి జాలరుల సహాయంతో శవాన్ని ఒడ్డుకు చేర్చారన్నారు. శరీరంపైన ఎరుపు రంగుతో పాటు పులి చారలరంగు చీర, ఆరెంజ్‌కలర్ జాకెట్ మెడపై పచ్చగుర్తులు, పుస్తె ఉన్నట్లు చెప్పారు. మృతురాలి వయస్సు సుమారు 35సంవత్సరాల వరకూ ఉండొచ్చన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారని ఎస్ఐ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం ఉన్నా మనూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

తుక్కు గోదాంలో అగ్ని ప్రమాదం

పటాన్‌చెరు టౌన్: తుక్కు గోదాంలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలో జరిగింది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్యా నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి....పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలోని పార్థ వెంచర్ల వద్ద తుక్కు గోదాంలో మంగళవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 20 నిమిషాల్లోనే మంటలను ఆర్పారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఎవరూ లేరని, తుక్కు తగలబడిందని వారు పేర్కొన్నారు.



కమ్ముకున్న పొగమంట

అవమాన భారంతో మహిళ ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: భూతు మాటలు తిట్టి, కొట్టి అవమానపర్చారంటూ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణానికి చెందిన బదనపురం బాలవ్వను పట్టణానికి చెందిన ఎల్లయ్య, రాజమణి, సుజాత అనే వ్యక్తులు పాత గొడవలు మనసులో పెట్టుకుని బాలవ్వను కొట్టి, భూతు మాటలు తిట్టడంతో అవమానంతో ఆమె మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

జహీరాబాద్: న్యాల్‌కల్ మండలంలోని గుంజోటి గ్రామానికి చెందిన హుల్గెర భాస్కర్ వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం...కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న భాస్కర్ ఈ నెల 5వ తేదీన అదృశ్యమయ్యాడు. ఆ రోజు భార్యకు బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో 11న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మండలంలోని హద్నూర్ గ్రామ శివారులోని బావిలో శవాన్ని తీయించినట్లుగా పోలీసులు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గర్భంలోనే శిశువు..

సిద్దిపేటకమాన్: గర్భంలోనే శిశువు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన పూజ అనే గర్భిణీని డెలివరీ కోసం కుటుంబ సభ్యులు శనివారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు డెలివరీకి సమయం ఉందని, ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని అబ్జర్వేషన్‌లో ఉంచారు. దీంతో పాటు ఆమెకు బీపీ, ఉమ్మనీరు ఎక్కువగా ఉండడంతో సంబంధిత చికిత్స అందించారు. మంగళవారం ఉదయం ఆమెకు వైద్యులు డెలివరీ చేసేసరికి మృతిచెందిన శిశువు జన్మించింది. విషయం తెలుసుకున్న బంధువులు వైద్యుల నిర్లక్షమే కారణమంటూ కాసేపు వైద్య సిబ్బందితో వాగ్వాదం చేశారు. వైద్యాధికారులు బంధువుల సమక్షంలో చర్చలు జరిపి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడారు. పూర్తి విచారణ జరిపిన తర్వాత రిపోర్టులను ఉన్నతాధికారులు, డీఎంఈకు పంపిస్తామన్నారు.

కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొండపాక(గజ్వేల్): కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కుకునూరుపల్లి రామాలయం వీధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి నుంచి లక్ష్మణ్‌రావు బయటకు వెళ్లే క్రమంలో అప్పటికే ఇంటి పరిసరాల్లో సుమారు 10 కుక్కలు గూమిగూడాయని తెలిపారు. కుక్కలను దాటుకుంటూ వెలుతుండగా ఒక్కసారిగా అవి దాడి చేశాయి. దీంతో మొహం, కంటి రెప్పలు, తల భాగంపై తీవ్రంగా కరిచాయి. వెంటనే కుటుంబీకులు లక్ష్మణ్‌రావును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంటి రెప్పలు, పెదవుల భాగాల వద్ద గాయాలవడంతో సర్జరీ చేయాల్సి ఉంటుందని గజ్వేల్ ఆస్పత్రినుంచి హైద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వైద్యులు తరలించారు. గ్రామంలో మాంసం విక్రయదారులు, వైన్స్‌ల వద్ద తినుబండారాలను ఇష్టారీతిన పడేస్తుండటంతోనే అవి మాంసానికి అలవాటు పడి గాయపరుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊర కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.



గాయపడ్డ లక్ష్మణ్‌రావు

రోడ్డు ప్రమాదంలో మహిళ..

- రహదారి పనుల జాప్యం వల్లే ప్రమాదాలు
- జాతీయ రహదారిపై స్థానికుల ధర్నా

సంగారెడ్డి మున్సిపాలిటీ: లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో మంగళవారం ఓ మహిళ చౌట్కూర్ మండలం సుల్తాన్ పూర్ వద్ద మృతి చెందింది. ఈ ఘటనలో భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..శంకరంపేట మండలం, ముసాయి పేట గ్రామానికి చెందిన వారు తమ పనులు ముగించుకొని ఇంటికొచ్చే క్రమంలో సుల్తాన్‌పూర్ వద్ద స్కూటీని లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే భార్య అక్షిత మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతణ్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పనులు పూర్తి కాకనే

మృతురాలు శంకరంపేట మండలం ముసాయిపేట గ్రామానికి చెందినవారుగా గుర్తించిన స్థానికులు కోపోద్రిక్తులై రహదారి పనులు పూర్తి కాకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ధర్నాకు దిగారు. 161 అకోల నాందేడ్ జాతీయ రహదారి పనులు పూర్తి కాకనే తరుచూ ఇలాంటి ప్రమాదాలు చూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అథారిటీ అధికారుల పనితీరును వారు తప్పుపడ్డారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులందరూ కలిసి సుమారు మూడు గంటల వరకూ నిరసనలో పాల్గొన్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అది జాతీయ రహదారి కావడంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సంగారెడ్డి టౌన్ సిఐ శ్రీధర్ రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులతో చర్చించారు. సుల్తాన్పూర్ బస్ స్టాప్ వద్ద మసీదును తొలగించక, జాతీయ రహదారి పూర్తి కాకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 161 జాతీయ రహదారి పనులు పూర్తి చేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు.



అక్షిత మృతదేహం